సాక్షి కామారెడ్డి

శుక్రవారం, 15, సెప్టెంబర్, 2023



ఘనంగా ఎడ్లపొలాల అమావాస్య

జిల్లావ్యాప్తంగా ఎడ్ల పొలాల అమావాస్య సందర్భంగా ఆవులు, ఎడ్లను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

- IIIలో ▸



విజృంభిస్తున్న జ్వరాలు

ఎల్లారెడ్డిలో వైరల్ ఫీవర్లతో ఆస్పత్రులు కిక్కిరిసిపోయాయి. వాతావరణంలో మార్పులతో చిన్నాపెద్దా ఇబ్బందులు పడుతున్నారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
29.7 /24.9

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం మేఘావృతమయ్యే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి

కామారెడ్డి టౌన్ : ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తిస్తూ, సీఎం, గవర్నర్‌లు ప్రభుత్వంలో విలీనం బిల్లును ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వీడీ దాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 2017, 2021 పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలన్నారు. పీఎఫ్, సీసీఎస్, ఎస్‌ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ బకాయిలు రూ. 4 వేల కోట్ల నిధులు విడుదల చేసి చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమస్యలపై నిలదీత




కామారెడ్డి టౌన్ : జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదర్ శోభ అధ్యక్షతన గురువారం జెడ్పీ సమావేశం హాల్‌లో రెండోరోజు స్థాయీసంఘ సమావేశం నిర్వహించారు. ఉదయం సాంఘిక సంక్షేమం, మధ్యాహ్నం మహిళా, శిశు సంక్షేమం, వ్యవసాయం అంశాలపై చర్చించి సమావేశాలను ముగించారు. రైతుల పంట నష్టపరిహారం అందించాలని జెడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి అధికారులను నిలదీశారు. పెండింగ్‌లో ఉన్న గొర్రెలను పంపిణీ చేయాలని జెడ్పీటీసీలు కోరారు. సంక్షేమ హాస్టళ్లలో కిచెన్ షెడ్‌లు, మూత్రశాలలు, మరుగుదొడ్ల పరిశుభ్రంగా ఉంచాలని స్థానిక వార్డెన్లకు ఆదేశాలు జారీ చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు రైతు రుణమాఫీ 1,84,997 లబ్ధిదారులకు గాను 72,900 మందికి రూ. 309.70కోట్లను రుణమాఫీ చేసినట్లు అధికారులు వివరించారు. గొర్ల పంపిణీ కార్యక్రమంలో 6,033 మందికి అర్హులుగా గుర్తిస్తే 700 మంది డబ్బులు కట్టారని, వీరిలో 228 మందికి పంపిణీ చేశామన్నారు. దళితబంధు రెండో విడతలో భాగంగా 1,100 మంజూరయ్యాయని చైర్‌పర్సన్ తెలిపారు.

మెడికల్ కళాశాలకు దారెటో..?



కామారెడ్డి టౌన్ : నేడు కామారెడ్డి మెడికల్ కళాశాలను వర్చువల్ విధానంలో సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. మెడికల్ కళాశాలకు దారి చూపేందుకు నిజాంసాగర్ చౌరస్తాలో అధికారులు సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి దేవునిపల్లి రోడ్డు మీదుగా కళాశాలకు దారి ఉంది. అయితే వ్యతిరేక దిశలో సూచిక బోర్డు పాతారు. ఈ బోర్డును చూసినవారు అయోమయానికి గురవుతున్నారు.


ఉత్తమ జీపీగా శివాయిపల్లి




రాజంపేట : స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా రాష్ట్రస్థాయిలో రాజంపేట మండలానికి చెందిన శివాయిపల్లి గ్రామం ఉత్తమ జీపీగా అవార్డు స్థానాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానోత్సవంలో భాగంగా శివాయిపల్లి సర్పంచ్ విశాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అరుణ్ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావ్, ప్రి న్సిపల్ సెక్రటరీ, కమిషనర్ పంచాయతీరాజ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నా రు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయన్న, డీపీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో బాలకిషన్, ఎంపీవో రఘురాం, నారాయణ తదిత రులు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సన్మానం

దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల సందర్భంగా రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సన్మానించారు. ఈ పోటీల్లో అండర్-14, అండర్-19 విభాగాల్లో పాఠశాలకు చెందిన అనుదీప్, రాజేందర్‌లు ఎంపికయ్యారు. వీరు అక్టోబర్‌లో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. పాఠశాల ప్రిన్సిపల్ దివ్య, పీడీ నర్సింహారెడ్డి, తదితరులున్నారు.





ఎన్నికల సారథ్యం గంపకే..

కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ

- ప్రచార బాధ్యతలన్నీ గోవర్ధన్‌కే..
- అభివృద్ధికి పారుతున్న నిధుల వరద
- యాక్టివ్ అయిన ప్రభుత్వ విప్

అసెంబ్లీ బరిలో సీఎం కేసీఆర్ నిలువనుండడంతో నియోజకవర్గ బాధ్యతలన్నీ గంప గోవర్ధన్‌కే అప్పజెప్పనున్నట్లు తెలుస్తోంది. వరుసగా గెలుపొందుతూ వస్తున్న గంప గోవర్ధన్‌ను బీఆర్‌ఎస్ అధిష్టానం ఈసారి పోటీ నుంచి తప్పించింది. సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి నేరుగా పోటీ చేస్తారని ప్రకటించిన తర్వాత నియోజకవర్గ బాధ్యతలు ఎవరు చూసుకుంటారన్నదానిపై చర్చ జరుగుతోంది. అయితే సిట్టింగు ఎమ్మెల్యేగా ఉన్న గంప గోవర్ధన్‌కే పూర్తి బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.

– సాక్షి, కామారెడ్డి

తాగునీటి పైప్‌లైన్‌కు..

కామారెడ్డి నియోజక వర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేయనుండడంతో నిధుల వరద మొదలైంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కామారెడ్డికి తాగునీటి కోసం వేసిన పైపులైన్ మాటిమాటికీ పగిలిపోయి సరఫరాకు ఆటంకం కలుగుతుండడంతో రూ.195 కోట్లు మంజూరు చేశారు. అలాగే కుల సంఘాల భవనాలు, ఆలయాల నిర్మాణాల కోసం మొదటి విడతలో రూ.10 కోట్లు మంజూరు చేశారు. తాజాగా మరో రూ. 15 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత నెల 14న ఎల్లారెడ్డి నియోజకవర్గ పర్యటనకు వెళ్తూ కామారెడ్డి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణంలో అంతర్గత రోడ్ల కోసం రూ. 25 కోట్లు, స్పోర్ట్స్ కాంప్లెక్సు పనులకు రూ. 20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగు ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వం గంప గోవర్ధన్‌ను పిలిపించి మాట్లాడుతోంది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ఇప్పటికే పలుమార్లు గోవర్ధన్‌తో నియోజకవర్గం పరిస్థితులపై చర్చించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా ఆయన నుంచి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ప్రచార బాధ్యతలతో పాటు పార్టీ శ్రేణులను సమన్వయం చేసే బాధ్యతలన్నీ ఆయనకే అప్పగించనున్నట్లు తెలుస్తోంది. పలుమార్లు సీఎంను, మంత్రి కేటీఆర్‌ను కలిశారు. తన కొడుకు పెళ్లికి సీఎం రావడంతో పాటు పార్టీ శ్రేణులతో కలిసి ఫొటోలు దిగడం, ఎక్కువ సమయం వెచ్చించడంతో గోవర్ధన్‌లో సంతోషం పెరిగింది. నియోజకవర్గ అభివృద్ధి గురించి తనను పిలిపించి మాట్లాడుతుండడతో ఆయన చురుకుగా వ్యవహరిస్తున్నారు. వివిధ శాఖల ద్వారా పెద్దఎత్తున నిధులు తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించి సీఎం కేసీఆర్‌కు అందించినట్లు సమాచారం.

ఎన్నికల్లో టిక్కెట్ మిస్ అయిన గంప గోవర్ధన్‌కు మంచి భవిష్యత్తు కల్పిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. భవిష్యత్ చూసుకుంటానని భరోసా ఇవ్వడంతో ఆయన నియోజకవర్గంలో యాక్టివ్‌గా తిరుగుతున్నారు. తన కొడుకు పెళ్లి సమయంలో వారం రోజులు కాస్త దూరంగా ఉన్నా

భవిష్యత్తుకు సీఎం భరోసా

తర్వాత నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగుతున్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో బిజీగా ఉంటున్నారు. ఇదే సమయంలో పార్టీ శ్రేణులతో మంతనాలు జరుపుతూ రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చిస్తున్నారు. గోవర్ధన్ యాక్టివ్ కావడంతో ఆయన అనుచరుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. అటు సీఎం, ఇటు మంత్రి కేటీఆర్‌తో రెగ్యులర్‌గా కలుస్తూ చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ గురించి చర్చించే అవకాశం దొరికింది. ఎన్నికల తర్వాత ఏ పదవి ఇస్తారన్నదానిపై కారిటీ లేదు.

వైద్యవిద్యలో నవశకం!

- నేడు మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం
- హాజరుకానున్న ప్రముఖులు



ముస్తాబైన మెడికల్ కాలేజీ

సాక్షి, కామారెడ్డి : జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల కాసేపట్లో ప్రారంభం కానుంది. వైద్య విద్యా రంగంలో నవశకంగా అభివర్ణిస్తున్నారు. వైద్య విద్య చదవాలన్న ఆసక్తితో ఎంత చదివినా తక్కువ సీట్లు ఉండి తీవ్ర పోటీ ఎదురయ్యేది. ఇప్పుడు జిల్లాకో వైద్య కళాశాల రావడంతో వైద్య విద్య అభ్యసించాలన్న ఆసక్తి ఉన్నవారు కొంత కష్టపడితే మంచి ర్యాంకు సాధించి సీట్లు సంపాదించే అవకాశం ఏర్పడింది. జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీని శుక్రవారం వర్చువల్‌గా సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. కాగా వైద్య కళాశాల ప్రారంభోత్సవ వేడుకలకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నారు. కాలేజీలో జిల్లాకు చెందిన ఎంతో మంది విద్యార్థులకు సీట్లు లభించాయి. వంద సీట్లతో ప్రారంభమైన మెడికల్ కాలేజీలో ఏటా వంద మంది కొత్త విద్యార్థులు జాయిన్ అవుతుంటారు. నాలుగేళ్ల తరువాత ఒక్కో బ్యాచ్ బయటకు వెళుతుంది. గతంలో డబ్బు ఉన్న వారే వైద్య విద్య చదివే పరిస్థితులు ఉండేవి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు వచ్చిందంటే చాలు ఎలాంటి ఖర్చులు లేకుండా హాస్టల్ సౌకర్యంతో చదువుకునే అవకాశం ఏర్పడింది. దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని భావిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లా నలుమూలల నుంచి పలువురు విద్యార్థులు నీట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా కామారెడ్డి మెడికల్ కాలేజీలో చేరేందుకు ఆప్షన్ ఇచ్చి సీట్లు పొందారు. వారంతా ఇప్పటికే కాలేజీలో జాయిన్ అయ్యారు. ప్రారంభోత్సవం తర్వాత తరగతులు మొదలుకానున్నాయి.

ఉమ్మడి జిల్లా నుంచి..

మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవ వేడుకలకు ఉమ్మడి జిల్లా నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ సింధే పాల్గొంటారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావ్ అధ్యక్షతన ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగనుంది. భారీ సంఖ్యలో విద్యార్థులను, జనాన్ని సమీకరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

కలెక్టర్ జితేష్ వి పాటిల్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం : సీఎం వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించనున్న వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం దేవునిపల్లిలోని వైద్య కళాశాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రవేశం పొందిన 100 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వైద్య కళాశాల అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొని వీక్షించడానికి వీలుగా లెక్చర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన స్క్రీన్, ఫర్నీచర్, సౌండ్ సిస్టంలను పరిశీలించారు. కళాశాలలో తరగతి గదులు, లెక్చర్ గ్యాలరీ, ల్యాబొరేటరీలు, ఇతర అన్ని వసతులు సిద్ధం చేశామన్నారు. ప్రొఫెసర్లు, సిబ్బందిని నియమించామన్నారు. విద్యార్థులకు విడివిడిగా వసతి సౌకర్యం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్ర మోహన్, వైద్య కళాశాల ప్రధానాచార్యులు వెంకటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి టెట్‌కు సర్వం సిద్ధం

- జిల్లావ్యాప్తంగా హాజరుకానున్న 9,740 మంది అభ్యర్థులు
- పక్కాగా నిమిషం నిబంధన అమలు



హాల్‌టికెట్ నంబర్లు అతికిస్తున్న సిబ్బంది

కామారెడ్డి టౌన్ : ఉపాధ్యాయ ఉద్యోగాలకు సంబంధించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పరీక్ష నేడు జిల్లాలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను విద్యాశాఖ, సంబంధిత అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పేపర్-1, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగనుంది. పరీక్షా సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.

అధికారుల నియామకం

పరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు పకబ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేశారు. కావాల్సిన అధికారులను, సిబ్బందిని నియమించారు. 24మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 24మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 48 మంది హాల్ సూపరింటెండెంట్లు, నలుగురు ఫ్లయింగ్‌స్క్వాడ్స్, 20 మందికి ఒక ఇన్విజిలేటర్లను నియమించారు. ఒక్కో పరీక్షా కేంద్రంలో 240 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ఆదేశాలు జారీ చేశారు. తాగునీరు, వైద్యం, ఇతర సౌకర్యాలను కల్పించనున్నారు. పరీక్షా కేంద్రాలల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. పరీక్షా సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాల్సి ఉంటుంది. ఆర్టీసీ అధికారులు పరీక్షా సమయానికి తగిన బస్సులను నడపనున్నారు. రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ, హెల్త్ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు.

9,740 మంది అభ్యర్థులు..

జిల్లాలో ఉదయం పేపర్ -1కు 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 5535 అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. అలాగే మధ్యాహ్నం 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 4205 అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు.

గంట ముందే హాజరు కావాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

కామారెడ్డి క్రైం : టెట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణ కోసం నియమించిన 360 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, హాల్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి పరీక్షా సామగ్రితో సమయానికి ఒక గంట ముందు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రాజు, పరీక్షల సహాయ సంచాలకులు నీలం లింగం, చీఫ్ సూపరింటెండెంట్లు, హాల్ సూపరింటెండెట్లు, ఇన్విజిలేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం : జాతీయ సమైక్యత దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో జాతీయ సమైక్యత, ఓటరు నమోదు, వైద్య కళాశాల ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలను ఈ నెల 17 న కామారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకలకు స్పీకర్ హాజరై పతాకావిష్కరణ చేస్తారన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ శాఖలు రుణాల పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అర్హులైన యువతను ఓటరుగా నమోదు చేసేలా చూడాలన్నారు. పెళ్లి చేసుకొని జిల్లాకు వచ్చిన మహిళలు ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. మత్తు పదార్థాలు, మత్తు పదార్థాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. మత్తుపదార్థాలతో అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని డీఈవో రాజుకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు రాజారాం, దయానంద్, వాణి, రజిత, మల్లిఖార్జున్ బాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో మసూద్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను గెలిపించుకోవాలి

- మూడు, నాలుగేళ్లలో కామారెడ్డి రూపురేఖలు మారిపోతాయి
- రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్ యాదవ్

సాక్షి, కామారెడ్డి : సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తుండడంతో రెండు మూడేళ్లలో రూపురేఖలు మారిపోతాయని, ఈ ప్రాంత ప్రజలు అదృష్టవంతులని అందుకే అద్భుతమైన మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం నిజామాబాద్ వెళ్తూ కామారెడ్డి పట్టణ శివారులోని ఓ హోటల్‌లో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో పాటు పశు సంవర్ధక శాఖ అధికారులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావ్, పశుసంవర్ధక, మత్స్యశాఖ, పాడి పరిశ్రమ శాఖల అధికారులు సింహారావ్, వరదారెడ్డి, శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, యాదవ సంఘాల నేతలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఊహించని విధంగా కామారెడ్డి నియోజక వర్గం అభివృద్ధి చెందుతుందని మంత్రి చెప్పారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా అందించి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చిందని, చేపల విక్రయాల కోసం మార్కెట్లు ఏర్పాటు చేశామన్నారు. మత్స్య సంపద పెరిగిందన్నారు. పల్లెలు, పట్టణాలను అభివృద్ధి చేయడానికి పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు చేపట్టి రూ. కోట్లు ఖర్చు చేశామన్నారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ చేసిందేమి లేదన్నారు. గజ్వేల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, కామారెడ్డి కూడా అంతకన్నా ఎక్కువ అభివృద్ధి జరుగుతుందన్నారు. విమర్శలు చేసేవాళ్లు ఒక్కసారి గజ్వేల్‌కు వెళ్లి చూడాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంభాల రవియాదవ్, యాదవ సంఘాల నాయకులు అర్కల ప్రభాకర్‌యాదవ్, మర్కంటి భూమన్న, రాజారాంయాదవ్, భూమేశ్ పాల్గొన్నారు.

ఉద్యమకారులమంతా ఐక్యమవుదాం

- తెలంగాణను కాపాడుకుందాం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు
- హాజరైన కోదండరాం, షబ్బీర్ అలీ, వివిధ పార్టీల నాయకులు, ఉద్యమ నేతలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

కామారెడ్డి టౌన్ : రాష్ట్రం కోసం ఎలాగైతే కొట్లాడామో ఇప్పుడు అదే తెలంగాణను కాపాడుకోవడానికి ఉద్యమకారులమంతా ఐకమత్యంతో మలిదశ ఉద్యమానికి సిద్ధమవ్వాలని వక్తలు పిలుపునిచ్చా రు. తెలంగాణ ఉద్యమకారుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఓయూ నేత, టీజేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నిజ్జన రమేష్ అధ్యక్షతన గురువారం జిల్లా కేంద్రంలోని రోటరి ఆడిటోరియంలో 'తెలంగాణ ఉద్యమకారులారా కలిసి మాట్లాడుకుందాం' రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా పార్టీల నేతలు, మేధావులు, విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు పాల్గొని మాట్లాడారు.

ప్రజాస్వామ్య పాలన రావాలి : కోదండరాం

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన రావాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన జేఏసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు చేసిన పోరాటాలను వివరించారు. కేసీఆర్ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, చత్తీస్‌గడ్ విద్యుత్ ఒప్పందం, ప్రాజెక్టులకు వేల కోట్ల డబ్బులు వృధా, ఇలా ఎన్నో అక్రమాలపై మాట్లాడినందుకు ఉద్యమకారులను దూరం చేసాడన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధరణితో రైతులకు ఉపయోగం లేదన్నారు. కేసీఆర్‌కు పాలించే అర్హత లేదన్నారు. కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

తెలంగాణను రక్షించుకుందాం

కామారెడ్డిలో పోటీ చేసే కేసీఆర్‌కు 7 చెరువుల నీళ్లు తాగిస్తామని ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. కేసీఆర్ చేతిలో మోసపోయిన వారిని కామారెడ్డికి తీసుకొస్తానన్నారు. కామారెడ్డిలో భూములను అమ్ముకోడానికి కేసీఆర్ వస్తున్నాడన్నారు. కేసీఆర్ కుటుంబంమంతా ప్రజాద్రోహులే అన్నారు. తెలంగాణ పీపుల్స్ జేఏసీ కమిటీ కో కన్వీనర్, రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ కన్వీనర్ కే. రవి మాట్లాడుతూ సాగు చేసే భూముల విషయంలో రైతుల విషయంలో ప్రభుత్వం దొంగ లెక్కలు చెబుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నీళ్లు 36లక్షల ఎకరాలకు కాదని, కేవలం 65వేల ఎకరాలకు మాత్రమేనన్నారు. గజ్వేల్‌లో 136 ఆత్మహత్యలు జరిగాయని, ఇక కామారెడ్డిలో జరగకుండా ఉండాలంటే కేసీఆర్‌ను చిత్తుగా ఓడించాలన్నారు. 10 తీర్మానాలను ఆమోదించారు. కేయూ ప్రొఫెసర్ రియాజ్, జేఏసీ కన్వీనర్ జగన్నాథం, టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్, క్యాతం సిద్ధిరాములు, ప్రభాకర్, ఆజాద్, బాల్‌రాజ్, లక్ష్మణ్‌యాదవ్, నర్సింహారెడ్డి, గణేశ్‌నాయక్ ఉన్నారు.

కవితకు ఈడీ నోటీసులపై కలకలం

- మార్చి 8 తర్వాత తాజాగా మరోసారి..
- రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ
- శిక్షిస్తేనే సమాజానికి మేలు : ఎంపీ ధర్మపురి అర్వింద్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఢిల్లీ లిక్కర్ కుంభకోణానికి సంబంధించి ఎమ్మెల్సీ కవితకు తాజాగా మరోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ నుంచి నోటీసులు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి కవితకు గత మార్చి 8న మొదటిసారి ఈడీ నుంచి నోటీసులు వచ్చాయి. తాజాగా మరోసారి నోటీసులు రావడం, ఎన్నికలకు కౌంట్‌డౌన్ నడుస్తుండడంతో జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో కవిత పట్ల ఈడీ ఏవిధంగా ముందుకు వెళ్తుందే అంశాన్ని పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠగా మాట్లాడుకుంటున్నారు.

కక్ష సాధింపు నేపథ్యంలోనే..: ఎమ్మెల్సీ కవిత

బీఆర్‌ఎస్ జాతీయ పార్టీగా మారిన తరువాత కేసీఆర్‌కు దేశవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేని బీజేపీ తమ కుటుంబంపై కావాలనే కక్షసాధింపు చేస్తోంది. ఈడీ లాంటి సంస్థలను మోదీ ప్రభుత్వం ఆడిస్తూ ఇలాంటి నోటీసులు పంపిస్తోంది. ఇలాంటి నేపథ్యంలో ఇచ్చిన నోటీసులకు స్పందించాల్సిన అవసరం లేదు. నెలలతరబడి ఈ కేసును సాగదీస్తూ ఇష్టం వచ్చినట్లు బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రతి రాష్ట్రంలో ఎన్నికల సమయంలో బెదిరింపులు చేయడం బీజేపీకి పరిపాటి అయిందన్నారు. సీరియల్‌లాగా సాగదీస్తున్నారు. రాజకీయ కక్షతో ఇచ్చిన నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు.

అభివృద్ధికి ఆటంకం : ఎంపీ అర్వింద్

కల్వకుంట్ల కవిత లాంటివాళ్లు సమాజానికి చెదపురుగులు. ఇలాంటి వ్యక్తులు అభివృద్ధికి ప్రధాన అడ్డంకి. కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతి కారణంగా తెలంగాణ రెండు దశాబ్దాల మేర వెనక్కు వెళ్లింది. కవితలాంటి వాళ్ల విషయంలో ఎంత తొందరగా నేరారోపణ రుజువు చేస్తే అంత మంచిది. కవిత చేసిన లిక్కర్ కుంభకోణంతో తెలంగాణ తలదించుకునే పరిస్థితి ఏర్పడింది. ఆమెకు ఈడీ నుంచి నోటీసులు వస్తే మోదీ నోటీసులుగా ఆమె అభివర్ణించడం చూస్తుంటే కళ్లు నెత్తికెక్కినట్లు అర్థమవుతోంది. అహంకారపూరిత మాటలకు పరాకాష్ఠ.

కొత్త జీతం కోసం కొర్రీలు

- జేపీఎస్‌లకు పే స్కేల్ వర్తింపజేయడంలో జాప్యం
- ఐడెంటిటీ కార్డు తయారు చేయించి వేతనం బిల్లుతో జతపరచాలని మెలిక


మోర్తాడ్‌లో రెగ్యులరైజ్ ఉత్తర్వులను అందుకుంటున్న జేపీఎస్‌లు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): క్రమబద్ధీకరణ చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పేస్కేల్ ప్రకారం వేతనం చెల్లించే విషయంలో సందిగ్ధత నెలకొంది. ఉద్యోగుల ఐడెంటి కార్డును తయారు చేయించి వేతనం బిల్లుతో జతపరిస్తేనే కొత్త వేతనం చెల్లించడానికి అవకాశం ఉంటుందని కొర్రీలు పెట్టడంతో ఉద్యోగుల్లో అసహనం వ్యక్తమవుతోంది. నాలుగున్నర సంవత్సరాల కింద నియమించబడిన జేపీఎస్‌ల ప్రొబేషనరీ పీరియడ్ గడిచిన ఏప్రిల్‌తో ముగిసిపోయింది. వెంటనే రెగ్యులరైజ్ చేయాల్సి ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో జేపీఎస్‌లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. చివరకు ప్రభుత్వం కమిటీ వేసి నివేదిక ఆధారంగా రెగ్యులరైజ్ చేయడానికి ఆమోదం తెలిపింది. ఇటీవల కమిటీ నివేదికలు ఉన్నతాధికారులకు అందడంతో జిల్లాలో 261 మంది జేపీఎస్‌లు రెగ్యులరైజ్ చేయబడ్డారు. వారికి గతంలో ఫిక్స్‌డ్ పే కింద రూ.28,719 వేతనం చెల్లించారు. ఇప్పుడు పే స్కేల్ అమలు చేస్తే రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా జీపీఎఫ్, ఇతర కటింగ్‌లు పోను కొంత తక్కువనే వేతనం లభిస్తుంది. వేతనంలో తేడా ఉన్నా ఉద్యోగ భద్రతతో పాటు ఉద్యోగోన్నతులకు అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో వారు రెగ్యులరైజ్ కోసం పట్టుబట్టారు. క్రమబద్ధీకరణ ఉత్తర్వులను జేపీఎస్‌లు ఇటీవల మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నా వేతనం విషయంలో తమకు ఇంకా న్యాయం జరుగలేదని వారు పేర్కొంటున్నారు. ఐడెంటి కార్డు తయారు, వేతనం బిల్లుతో జతపర్చడం అనే అంశాన్ని తెరపైకి తీసుకురావడం కాలయాపన చేయడం కోసమేననే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జేపీఎస్‌లకు కొత్త వేతనాన్ని వెంటనే అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

సోయాలో కాండపు ఈగ పురుగును అరికట్టాలి



మద్నూర్(జుక్కల్): సోయాబీన్‌లో కాండపు ఈగ పురుగు ఆశించిందని, రైతులు సకాలంలో పంటకు స్ప్రే చేసుకోవాలని పెద్ద తడ్గూర్ ఏఈవో సతీష్ సూచించారు. పెద్ద తడ్గూర్ శివారులోని సోయాబీన్, పత్తి పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈగ నివారణకు క్లోరోన్‌ట్రిపోనిల్, లామ్‌డా అమ్‌ప్లిగో అనే మందును 80 మి.లీ ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తి పంటలో రసం పీల్చే పరుగులు, తామర, పచ్చ, తెల్లదోమ ఉన్నట్లు గుర్తించామన్నారు. డిఫెన్‌థిరస్, హెర్కులెస్ 200 గ్రాముల మందు, పూత పిందె రాలడాన్ని నివారించేందుకు ప్లానోఫిక్స్ ఎకరాకు 50 మి.లీ పిచికారీ చేయాలన్నారు. రైతుబంధు అధ్యక్షుడు జక్కు గంగారాం, రైతులు మాధవ్‌రావ్ పటేల్, తదితరులున్నారు.

పారిశుధ్య పనుల ఫొటోలు తీసి పంపాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు గ్రామాలలో చేపట్టే పారిశుధ్య పనులకు సంబంధించిన ఫొటోలను తీసి సంబంధిత గ్రూపులలో పంపాలని నాగిరెడ్డిపేట మండల పంచాయతీ అధికారి(ఎంపీవో) శ్రీనివాస్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ గ్రామాల కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 11లోపు వారి డీఎస్ఆర్ నమోదును పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో దోమల నివారణ కోసం సాయంత్రం వేళ ఫాగింగ్ చేయించాలన్నారు. ప్రజలకు అందించే తాగునీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఉమ్మడి నిజామాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 23న తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు సంస్థ నిజామాబాద్ ఆర్సీవో అలివేలు గురువారం తెలిపారు. మండలంలోని ధర్మారం(బి)లో ఉన్న ఆర్సీవో కార్యాలయంలో ఈ ప్రవేశాలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9908799462ను సంప్రదించాలన్నారు.

బీసీ గురుకుల పాఠశాల భవనం పరిశీలన


పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండల కేంద్రంలో రూ.6.70 కోట్లతో నూతనంగా నిర్మించిన బీసీ బాలుర గురుకుల పాఠశాల భవనాన్ని గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. భవన నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయని ఈ నెల 16న ప్రారంభిస్తామని ఆయన అన్నారు. ప్రారంభోత్సవానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ హాజరు కానున్నారని తెలిపారు. నాయకులు అవారి గంగారాం, ఆరీఫ్, లాయఖ్, సందీప్ పటేల్, మద్దినేని నాగేశ్వరరావు ఉన్నారు.

గిరిజన గురుకుల విద్యాలయం కోసం స్థల పరిశీలన

బాన్సువాడ రూరల్: కోనాపూర్- హన్మాజీపేట్ గ్రామాల మధ్య గిరిజన బాలికల గురుకుల విద్యాలయం నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని, అలాగే రూ.65లక్షల నిధులతో నిర్మిస్తున్న మున్నూరుకాపు సంఘం భవన పనులను గురువారం స్పీకర్ పరిశీలించారు. డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాం , ఎంపీటీసీలు సుధాకర్‌రెడ్డి, జెట్టి హన్మాండ్లు, కోనాపూర్ సర్పంచ్ రమణారావు పాల్గొన్నారు.

కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ఉద్యోగులకు అన్యాయం

- సమ్మెకు కోదండరాం, షబ్బీర్‌అలీల మద్దతు


శిబిరంలో కూర్చున్న కోదండరాం

కామారెడ్డి టౌన్: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విద్యాశాఖలో విలీనం చేయాలని చేయాలని చేపడుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం, మాజీ మంత్రి షబ్బీర్ అలీలు తమ మద్దతు తెలిపారు. సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. సమయానికి జీతాలు రావడం లేదని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితులు ఉన్నాయని వారు అన్నారు. టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు సందీప్, చందు, ప్రవీణ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన నాయకులతో కాసుల బాలరాజు

బాన్సువాడ: నస్రుల్లాబాద్ మండలం అంకోల్ తండా గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాలరాజు సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి ఆయన ఆహ్వానించారు. రానున్న ఎన్నికలకు దృష్టిలో పెట్టుకొని నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని ఆయన అన్నారు. నాయకులు కెతావత్ రూప్‌సింగ్, మధు, మంత్రి గణేష్, ప్రభాకర్, కొట్టం గంగాధర్, రామ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్(బాన్సువాడ): అంకోల్ తాండకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు కాసుల బాల్ రాజ్ తెలిపారు. నాయకులు గణేష్, రూప్ సింగ్, మదుసూధన్, యూసుఫ్, ఆత్మార్ ఉన్నారు.

ఆధ్యాత్మికం

యజ్ఞయాగాదులతో పుష్కలంగా వర్షాలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): యజ్ఞ యాగాదులు చేయడం వల్ల పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయని వేద ధర్మ ప్రచారకులు వేద సింధు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రావణమాస యజ్ఞ కార్యక్రమంనిర్వహించారు. ప్రతి ఒక్కరు ధర్మాన్ని ఆచరించాలని, ధర్మాన్ని ఆచరించిన వారికి ధర్మమే కాపాడుతుందని ఆయన అన్నారు. నాయకులు నాగరాజుగౌడ్, హన్మాండ్లు తదితరులున్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



పిట్లం(జుక్కల్): పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తుల కోసం అన్నదానం చేశారు.

పార్వతీదేవి ఆలయంలో రుద్రాభిషేకం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): శ్రావణమాసం చివరి రోజు పురస్కరించుకొని మాల్తుమ్మెదలోని పార్వతీదేవి ఆలయంలో గురువారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అభివృద్ధిలో దేశంలోనే ముందున్నాం


చెక్కులు పంపిణీ చేస్తున్న గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: సంక్షేమం, అభివృద్ధి విషయంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి నియోజకవర్గంలోని 71 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.71 లక్షల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, మరో 45 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.21.63 లక్షల విలువైన చెక్కులను ప్రభుత్వ విప్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎవరైనా నిరుపేదలు అనారోగ్యం, రోడ్డు ప్రమాదాల బారిన పడితే వారికి ఆర్థిక సహాయం అందేలా చూస్తానన్నారు. వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, అధికార ప్రతినిధి బల్వంత్ రావు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన


గండిమాసానిపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ తదితరులు

ఎల్లారెడ్డి: మండలంలోని 17 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో మన్నె ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న పోలింగ్ కేంద్రాలతో పాటు గండిమాసానిపేట, వెల్లుట్ల, వెల్లుట్లపేట, వెంకటాపూర్ గ్రామాలలో గల 17 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. తహసీల్దార్ సురేష్, సీఐ శ్రీనివాస్, డీటీ రాజేశ్వర్ తదితరులున్నారు.

గణేశ్ ఉత్సవాలపై సమావేశం

గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. ఉత్సవాల నిర్వహణపై గురువారం ఆర్డీవో కార్యాలయంలో పోలీస్, విద్యుత్, ఆర్అండ్‌బీ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గణేష్ మండపాల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని అన్నారు.

లగ్జరీ కార్లు, బైక్‌ల పేరిట మోసం

పోలీసులను ఆశ్రయించిన బాధితులు


కామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులు

కామారెడ్డి క్రైం: లగ్జరీ కార్లు, బైక్‌లను తక్కువ ధరకే ఇప్పిస్తానని ఆశ చూపెట్టి పట్టణానికి చెందిన ఓ యువకుడు మోసం చేశాడని ఆరోపిస్తూ గురువారం పలువురు బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. డబ్బులు తిరిగి ఇప్పించాలని పోలీసుల వద్ద మొర పెట్టుకున్నారు. వివరాలు.. పట్టణంలోని ఇస్లాంపుర కాలనీకి చెందిన లుక్మాన్ అనే యువకుడు కొద్ది రోజులుగా హైదరాబాద్‌లో ఉంటూ తాను కన్సల్టెన్సీ నడిపిస్తున్నానని చెప్పి.. తెలిసిన వారి వద్ద నుంచి రూ.కోటి వరకు డబ్బులు వసూలు చేశాడు. లగ్జరీ కార్లు, బైక్‌లను చూపించి దాదాపు కామారెడ్డికి చెందిన ఆరుగురితో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన 20 మంది నుంచి రూ.కోటికి పైగా వసూలు చేశాడు. డబ్బులు అడిగితే చాలా రోజులుగా తప్పించుకు తిరుగుతున్నాడు. ఇటీవలే అతడి ఆచూకీ దొరికడంతో తమ వద్ద నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు. ఇంకా తమకు ఫిర్యాదు అందలేదని, బాధితులు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

నిఘా వ్యవస్థను పటిష్ట పరుస్తాం


బాధితురాలితో మాట్లాడుతున్న సీపీ

బోధన్‌టౌన్(బోధన్): పండుగల నేపథ్యంలో నిఘా వ్యవస్థను పటిష్టపరుస్తామని సీపీ సత్యనారాయణ అన్నారు. బోధన్‌కు పీఎస్‌ను సీపీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా పీఎస్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. బోధన్‌లో ట్రాఫిక్ వ్యవస్థను నివారించడానికి ఉన్నత అధికారులతో మాట్లాడి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని, ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పట్టణ కేంద్రానికి చెందిన మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ ఘటనను త్వరగా చేదించి నిందితులను పట్టుకుంటామని సీపీ తెలిపారు. చోరీ జరిగిన హనుమాన్ టేకిడి ప్రాంతాన్ని పరిశీలించారు. సీపీ వెంట డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్ రాజు, సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో ఒకరి మృతి


లింగేశ్వర్ (ఫైల్)

మాక్లూర్: మండల కేంద్రానికి చెందిన లింగేశ్వర్ (37) గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. లింగేశ్వర్ వ్యవసాయ పరికరాలను రిపేర్‌చేస్తూ జీవిస్తున్నాడు. స్నేహితులతో కలిసి ముచ్చటిస్తున్న సమయంలో ఒక్కసారిగా ఛాతిలో నొప్పిరావడంతో స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. లింగేశ్వర్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఎల్లారెడ్డి: మండలంలోని కొక్కొండ గ్రామానికి చెందిన యువకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ (30)చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీనివాస్ కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఈ నెల 4న పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్నిలో మరొకరు..


వినోద్ మృతదేహం

వర్ని: మండలంలోని పాత వర్ని గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ (36) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల వినోద్ మద్యం మత్తులో క్రిమిసంహారక మందు తాగడంతో కుటుంబీకులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరద కాలువలో మృతదేహం


మృతదేహాన్ని బయటకు తీస్తున్న జాలర్లు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన షేక్‌రియాజ్(30) రెండు రోజుల క్రితం వరద కాలువలో దూకి అదృశ్యం కాగా గురువారం మృతదేహం లభ్యమైనట్లు ప్రొబెషనరీ ఎస్సై శివాజీ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ శివారులోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరి గురువారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేయడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి రూ. 5వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

పాఠశాలలో బాలుడి అదృశ్యం


జీవన్

వర్ని: మండలంలోని కోటయ్య క్యాంపులో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి జీవన్ గురువారం అదృశ్యమయ్యాడు. ఉదయం టిఫిన్ చేసే సమయంలో గమనించిన పీఈటీ హెచ్‌ఎం రాధకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు అదృశ్యమైనట్లు బాలుడి తండ్రి ఆరోపించారు.

పాంగ్రాలో వివాహిత..

ఖలీల్‌వాడి: నగరంలోని పాంగ్రాకు చెందిన బానోత్ నవ్యశ్రీ అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ గురువారం తెలిపారు. మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన నవ్యశ్రీ తిరిగి రాలేదన్నారు. భర్త నెహ్రూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన చిన్న నర్సయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము గురువారం తెలిపారు. రామర్తి రేవతికి చెందిన ఇంటి స్థలాన్ని చిన్న నర్సయ్య తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని నిర్మాణ పనులు చేపడుతున్నాడు. బాధితురాలు తహసీల్దార్, జీపీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. దీంతో కోపంతో చిన్న నర్సయ్య రేవతిపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైకులు చోరీ

మాక్లూర్: మండలంలోని బొంకన్‌పల్లిలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు రెండు బైకులను దొంగిలించారు. గ్రామానికి చెందిన వెంకటేశ్‌గౌడ్, ప్రశాంత్ తమ ఇంటి ఎదుట రాత్రి బైకులను నిలిపి నిద్రపోయారు. ఉదయం చూసే సరికి బైకులు కనిపించక పోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సెల్‌టవర్ ఎక్కిన యువకుడు

వర్ని: మండల కేంద్రంలో ఓ యువకుడు కుటుంబ కలహాలతో సెల్ టవర్ ఎక్కినట్లు పోలీసులు గురువారం తెలిపారు. వడ్డేపల్లికి చెందిన శివకుమార్ కొంతకాలంగా భార్యతో గొడవలు జరగడంతో హైదరాబాద్‌లో ఉంటున్నాడు. బుధవారం ఇంటికి వచ్చినా పరిస్థితి మారకపోవడంతో జీవితంపై విరక్తితో సెల్ టవర్ ఎక్కినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులతో చర్చించి సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో కిందికి దిగినట్లు పోలీసులు తెలిపారు.

గణేశ్ ప్రతిమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలి


సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: వినాయకచవితి సందర్భంగా జిల్లాలోని అన్ని వినాయక మండపాల నిర్వాహకులు ప్రతిమల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సీపీ సత్యనారాయణ గురువారం పేర్కొన్నారు. 18న వినాయకచవితిని పురస్కరించుకుని మండపాల నిర్వాహకులు దిగువ చూపిన లింకు ద్వారా http://po iceporta.trpoice.gov.in పోలీసుల అనుమతి పొందాలన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యుత్ కనెక్షన్‌కు సంబంధిత శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాల వద్ద పోలీస్‌శాఖ సూచించిన సమయం ప్రకారమే సౌండ్‌బాక్సులు పెట్టాలని ప్రజలకు ఇబ్బందికరంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

మక్కపంటపై అడవి పందుల దాడి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల శివారులో అడవిపందుల దాడిలో మక్కపంట ధ్వంసమైనట్లు బాధిత రైతులు గురువారం పేర్కొన్నారు. ఈ ఏడాది పంట అధిక దిగుబడి రాలేదని దీనికి తోడు అడవి పందులు, కోతులు పంటలను ధ్వంసం చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు బాధిత రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.

తడపాకల్ విద్యార్థినికి అక్షరయాన్ పురస్కారం


దేగల వైష్ణవి

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దేగల వైష్ణవికి అక్షరయాన్ పురస్కారం -2022 అందించారు. సాహిత్యపరంగా విశేష కృషి చేసిన వైష్ణవి అమ్మ సరళ వచన శతకం, చదువు సరళ వచన శతకం, చిన్నారి కథల పుస్తకాల్లో తన సాహిత్య ప్రతిభను కనబర్చడంతో అక్షరయాన్ సంస్థ వ్యవస్థాపకురాలు అయినంపూడి లక్ష్మి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 23న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో వైష్ణవికి పురస్కారాన్ని అందించనున్నారని తెలుగు పండిత్ ప్రవీణ్ శర్మ వెల్లడించారు.

మృతదేహం లభ్యం


హబీద్ అలీ(ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డికి చెందిన ఓ యువకుడు అదృశ్యం కాగా గురువారం మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. గ్రామంలోని మహ్మద్ హబీద్ అలీ(35) ఈ నెల 4న ద్విచక్ర వాహనంపై కామారెడ్డికి వెళ్తున్నట్లు చెప్పి రాలేదు. గురువారం అదే గ్రామానికి చెందిన రాంశెట్టి శేఖర్ తోట పక్కన ఉన్న చెరువు వాగు చెక్‌డ్యామ్‌పై గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని హబీద్‌గా పోలీసులు గుర్తించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


స్వామి(ఫైల్)

కామారెడ్డి క్రైం: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై రాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయికి చెందిన అజ్జపల్లి స్వామి(31) పనినిమిత్తం కామారెడ్డికి బైక్‌పై వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ఆకుల ఈశ్వర్ బైక్‌పై కామారెడ్డికి వస్తుండగా ఢీకొన్నారు. ఈ ఘటనలో స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఈశ్వర్‌ను స్థానికులు కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.